# చెట్టును ఢీకొట్టిన కారు

- అక్కడికక్కడే ఇద్దరి మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- నలుగురూ ఇంటర్ విద్యార్థులే..

ఖిలావరంగల్/గీసుగొండ, జూన్ 12: కారు చెట్టును ఢీకొట్టగా ఇద్దరు మృతి చెందారు.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు వేర్వేరు కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న వీరు చిన్ననాటి స్నేహితులు. ఈ ఘటన గురువారం గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ వసంతపురంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చింతల్‌కు చెందిన అబ్బుజర్, ఎల్బీనగర్‌కు చెందిన సోహెబ్, ఎండీ సమీర్, జాన్‌పీరీలుకు చెందిన ఇస్మాయిల్‌ఖాన్ చిన్న నాటి స్నేహితులు. వీరు వేర్వేరు కళాశాలల్లో ఇంటర్ చదువుతున్నారు. సెల్ఫ్ డ్రైవింగ్‌లో నలుగురు కలిసి వెంకటాపూర్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వసంతపురం శివారులో కారు టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి పల్టీలు కొట్టి నుజ్జునుజ్జయింది. దీంతో అబ్బుజర్, సోహెబ్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇస్మాయిల్, సమీర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని అంబులెన్స్‌లో నగరంలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో చింతల్, ఎల్బీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. గీసుగొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన కారు

### ఐదుగురికి గాయాలు

గీసుగొండ: రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడిన ఘటన విశ్వనాథపురం శివారులోని అఫెక్స్ ఇంజినీరింగ్ కళాశాల మలుపు వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ వైపు వెళ్తున్న బొలెరో ఎదురుగా నర్సంపేటకు వెళ్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారు బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సంగెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వేముల రవీందర్‌రెడ్డి, భార్య మమత, కూతురు నిద్యతి, తండ్రి రామ్‌చంద్రారెడ్డి, తల్లి ఎలేంద్రను ఎంజీఎం దవాఖానకు తరలించినట్లు ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు.


పర్వతగిరి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

# పంట మార్పిడితోనే నేలకు రక్షణ: శాస్త్రవేత్తలు

ఖానాపురం/రాయపర్తి/గీసుగొండ/నెక్కొండ/పర్వతగిరి, జూన్ 12: పంట మార్పిడితోనే నేలకు, నీటికి రక్షణ ఉంటుందని వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు గోపిక అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధరావుపేట రైతు వేదికలో బుధరావుపేట, మంగళవారిపేట రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని గోపిక సూచించారు. వాతావరణ మార్పులకనుగుణంగా పంట మార్పిడి చేసుకోవాలన్నారు. తొలకరి వర్షాలు కురవగానే రైతులు జీలుగ, పెసర సాగు చేసి 35 రోజుల తర్వాత నేలలో కలియదున్నాలన్నారు. అప్పుడు భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని వివరించారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవోలు పాల్గొన్నారు. రాయపర్తి మండలకేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓంప్రకాశ్, మాధవి మాట్లాడుతూ రైతులు ఏటా ఒకేతీరు పంటలు వేయకుండా మార్పిడి విధానం అనుసరించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఏవో వీరభద్రం, ఏఈవోలు రాజేశ్, క్రాంతికుమార్, కావ్య, మనస్విని పాల్గొన్నారు. అలాగే, గీసుగొండ మండలంలోని బొడ్డు చింతలపల్లిలో జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీధర్, రాజు, ఏవో హరిప్రసాద్‌బాబు, ఏఈవో సంపత్, వెటర్నరీ ఆఫీసర్ నాగరాణి పాల్గొన్నారు.

నెక్కొండ మండలంలోని తోపనపల్లి, పెద్ద కోర్పోలులో జరిగిన సదస్సుల్లో శాస్త్రవేత్తలు ఎడ్ల హరి, మధు, జోగు కమలాకర్, సుహాసిని పాల్గొన్నారు. అంతేకాకుండా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు శాస్త్రవేత్త రాములు అవగాహన కల్పించారు.

### మారిన అధికారుల సెల్ నంబర్లు

నర్సంపేట, జూన్12: నర్సంపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ డీఈ, ఏడీఈ, ఏఈల సెల్ నంబర్లు మారినట్లు డీఈ పి.తిరుపతి తెలిపారు. ఎయిర్‌టెల్ కొత్త నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**పాత ఫర్నీచర్ కావలెను**
★స్కూల్‌కు సంబంధించిన పాత ఫర్నీచర్ కావలెను. వెంటనే సంప్ర: శ్రీ భువనేశ్వరీ అప్పర్ ప్రైమరీ స్కూల్, సెల్: 8465877022.
NTW-337020

**WANTED**
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**WANTED HOSPITAL STAFF**
jobs Apply Now!
★PHARMACY BOYS (Experienced)
★LAB TECHNICIANS (Experienced)
★COMPUTER OPERATORS & SUPERVISORS
Guardian Hospital, Mulugu 'X' Road, WGL. 12 to 2 PM.
NTW-522

**LOSS OF PASSPORT**
★I, MOHAMMED MANZOOR SHAREEF S/o. MOHAMMED HUSSAIN SHAREEF R/o H.No. 2-6-1109, Near Masjide Shariefain, KLN Reddy Colony, Subedari, Hanamkonda Town & Dist-506001. I Lost my Original Passport bearing No. H0384920 issued at Hyderabad. While travelling by bike to Xerox Center, Subedari. If anybody found Please inform to me cell: 9849202825.
NTW-6706

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలి
- కలెక్టర్ సత్యశారద
- పాఠశాలలు పునప్రారంభం
- స్కూళ్లను ముస్తాబు చేసిన ఉపాధ్యాయులు


వర్ధన్నపేట: ల్యాబర్తి పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట/సంగెం, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని కలెక్టర్ సత్యశారద అన్నారు. బడిబాట కార్యక్రమంతోపాటు పాఠశాలలు పునప్రారంభమైన సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఆమె విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, స్కూల్‌లో చేరిన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం, అర్హత ఉన్న ఉపాధ్యాయులు పని చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు కేవలం ఆర్భాటం కోసం ప్రైవేటు పాఠశాలలకు పంపుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే ఎక్కువ మార్కులు సాధించారని గుర్తుచేశారు. సర్కారు బడుల్లో క్రీడలు, విద్యా ప్రగతికి విశేషంగా కృషి చేసేలా ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఉపాధ్యాయులు కూడా నిబద్ధతతో పని చేస్తూ తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో జ్ఞానేశ్వర్, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే, సంగెం మండలం గుంటూరుపల్లి ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. స్కూల్ ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాంతోపాటు పాఠ్యపుస్తకాలను సత్యశారద పంపిణీ చేశారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### వడివడిగా పాఠశాలలు ప్రారంభం

నర్సంపేట/ఖిలావరంగల్/కరీమాబాద్/పోచమ్మమైదాన్/ఖానాపురం: వడివడిగా పాఠశాలలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు విద్యార్థులు పాఠశాలలకు మందకొడిగానే వచ్చారు. ఉపాధ్యాయులు పిల్లలకు స్వాగతం పలికారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాలలను మామిడి తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. గురిజాల జడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు ఏవో కృష్ణకుమార్ చేతులమీదుగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందించారు. వరంగల్ శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంను 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ పంపిణీ చేశారు. వరంగల్ మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేశ్ ఆధ్వర్యంలో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలికి నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. వరంగల్ దేశాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చక్రపాణి అధ్యక్షతన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, ఏకరూప దుస్తులను కార్పొరేటర్ కావటి కవితా రాజు యాదవ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జూలూరు పద్మ, సామాజిక సేవకుడు డాక్టర్ పాలడుగుల సురేందర్ పంపిణీ చేశారు. చెన్నారావుపేట మండలంలోని విద్యా వనరుల కేంద్రంతోపాటు పలు పాఠశాలలను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సృజన్‌తేజ సందర్శించారు. ఎమ్మార్సీ కార్యాలయంలోని పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఖానాపురం మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్సై రఘుపతి చేతులమీదుగా విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందజేశారు. తహసీల్దార్ రమేశ్ పాల్గొన్నారు.


పెద్దికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు

## మాజీ ఎమ్మెల్యే పెద్దికి ఘన స్వాగతం

నర్సంపేట, జూన్ 12: డల్లాస్ పర్యటనను ముగించుకుని నర్సంపేటకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఘన స్వాగతం పలికారు. నర్సంపేట పట్టణ, రూరల్ మండలం, చెన్నారావుపేట, నల్లబెల్లి, ఖానాపురం, దుగ్గొండి, నెక్కొండ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు పెద్దిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ, వివిధ మండలాల అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నామాల సత్యనారాయణ, బానోత్ సారంగపాణి, బాల్నె వెంకన్న, ముఖ్య నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ చింతకింది వంశీ, కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, కొండవీటి ప్రదీప్‌కుమార్, మహేందర్‌రెడ్డి, బానోత్ వీరన్న, హంస విజయరామరాజు, బోడ రవినాయక్, బోడ మురళీనాయక్, మంద చిన్ను, నరసింహ, అన్వేశ్, కక్కెర్ల శ్రీనివాస్, గుగులోత్ సురేందర్, జాటోత్ తిరుపతి, సూరయ్య, మోహన్‌రావు, సారయ్య, రామరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భర్త గొంతు కోసిన భార్య

గిర్మాజీపేట, జూన్ 12: కుటుంబ కలహాల వల్ల క్షణికావేశానికి లోనైన ఓ భార్య తన భర్త గొంతుకోసి హత్యాయత్నం చేసిన ఘటన 25వ డివిజన్ చార్‌బౌళిలో బుధవారం రాత్రి జరిగింది. బాధితుడి తండ్రి మహ్మద్ అతావుర్ రహమాన్ కథనం ప్రకారం.. కాటారం ఇబ్రహీంపేటకు చెందిన కబీర్ వివాహం చార్‌బౌళి ప్రాంతానికి చెందిన హినాతస్లీంతో 12 ఏళ్ల క్రితం జరిగింది. వీరికి కూతురు ఉంది. హినాతస్లీం ఎక్కువ శాతం తల్లిగారింటి వద్దే ఉంటుండడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కబీర్ తన భార్యను తీసుకెళ్లేందుకు వరంగల్‌కు వచ్చాడు. ఈ క్రమంలో మాటామాట పెరిగి గొడవకు దారి తీసింది. భార్యతోపాటు ఆమె బంధువులు కబీర్‌పై దాడి చేసే క్రమంలో క్షణికావేశంలో హినాతస్లీం కత్తితో తన భర్త కఫిల్ గొంతు కోసి భయంతో పరుగులు తీశారు. గమనించిన స్థానికులు అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ షుకుర్ తెలిపారు.

## భద్రకాళి ఆలయ ధర్మకర్తగా శ్రీనివాసరావు



వరంగల్‌చౌరస్తా, జూన్ 12: భద్రకాళి ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యుడిగా అనంతుల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వ్యాపారవేత్తగా గుర్తింపు కలిగిన ఆయన ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యుడిగా ఎన్నిక కావడంతో నగర ప్రముఖులు అభినందించారు.


ఎర్రబెల్లితో కేతిరి రాజశేఖర్, నాయకులు

## మాజీ మంత్రి ఎర్రబెల్లికి శుభాకాంక్షలు

కాశీబుగ్గ, జూన్ 12: అమెరికా నుంచి తిరిగి వచ్చిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరి రాజశేఖర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కేతిరి సంతోష్, బనద్రి రంజిత్‌కుమార్, బానోత్ చిరంజీవి, ధరావత్ విజయ్ ఉన్నారు.

## మున్సిపల్ స్థలం కబ్జాకు యత్నం?

పోచమ్మమైదాన్, జూన్ 12: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని గ్యాస్ గోదాం సమీపంలోని మున్సిపల్ సఫాయి స్థలం కబ్జాకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతేడాది ఈ స్థలం ఆక్రమణకు ప్రయత్నాలు జరగగా స్థానికులు నిరసన తెలపడంతో సద్దుమణిగింది. మళ్లీ కొందరు నాయకుల అండదండలతో కబ్జాకు ముమ్మర యత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. రెండు నెలల క్రితం బీజేపీ నాయకులు ఈ స్థలాన్ని సందర్శించి ఆరా తీశారు. కోట్లాది రూపాయల విలువైన భూమిని ఆక్రమించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై ఆర్‌టీఐ యాక్ట్ కింద తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. తాజాగా ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు గుంతలు తీయడంతో మళ్లీ వివాదానికి దారితీసింది. కార్పొరేటర్లు మాత్రం తమకేమీ సంబంధం లేదని చెబుతున్నారు.


మొక్క నాటుతున్న డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఖిలావరంగల్, జూన్ 12: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ మేయర్ సయ్యద్ రిజ్వానా షమీమ్ మజూద్ కోరారు. గ్రేటర్ వరంగల్ 37వ డివిజన్ చింతల్‌లో వన మహోత్సవంలో భాగంగా గురువారం ఆమె మొక్కలు నాటారు. అంగన్‌వాడీ సెంటర్ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీని ప్రారంభించిన అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఉర్దూ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు బుక్స్, యూనిఫాం పంపిణీ చేశారు.

### భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

పోచమ్మమైదాన్/నల్లబెల్లి, జూన్ 12: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని వరంగల్ 12వ డివిజన్ కార్పొరేటర్ కావటి కవితా రాజు యాదవ్ కోరారు. వరంగల్ దేశాయిపేటలోని షాదీఖానలో గురువారం ఏర్పాటు చేసిన సదస్సును వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దరఖాస్తులు స్వీకరించారు. అలాగే, నల్లబెల్లి మండలంలోని మేడెపల్లి, శనిగరంలో సదస్సులు జరిగాయి. తహసీల్దార్ ముప్పు కృష్ణ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

### రైలులో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

ఖిలావరంగల్, జూన్ 12: వేగంగా వెళ్తున్న రైలులో నుంచి ఓ ప్రయాణికుడు జారిపడి మృతి చెందిన ఘటన గురువారం ఎల్గూరు రైల్వేస్టేషన్ యార్డులో జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ సురేందర్ కథనం ప్రకారం.. ఎల్గూరు రైల్వేస్టేషన్ యార్డులోని హోం సిగ్నల్ వద్ద సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎత్తు 5.5 అడుగులు, చామన ఛాయ రంగు, గుండ్రటి ముఖం, బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంటు, బ్రౌన్ కలర్ టీషర్టు ధరించి ఉన్నాడు.

### విద్యుదాఘాతంతో కాడెద్దు..

వర్ధన్నపేట, జూన్ 12: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని ఇల్లంద శివారు గ్యాస్ గోడౌన్ వద్ద గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు బొంతల అనిల్ తన కాడెద్దును పొలాల వద్దకు తీసుకెళ్లి వస్తుండగా జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ. 70 వేల నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు.

### సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

నల్లబెల్లి, జూన్ 12: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జ్యోతి సూచించారు. మేడెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రామారావుతండాలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

### బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

నర్సంపేట, జూన్ 12: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వనప్రేమి అవార్డు గ్రహీత గోక రామస్వామి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్వయం కృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో బాల కార్మిక వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వర్ధన్నపేట, జూన్ 12: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కోరారు. వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ పరిధిలోని కోనాపురంలో గురువారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన చిన్నారులు, గర్భిణులు, బాలింతల కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు పంపిస్తే విద్యాబుద్ధులతో పాటు పోషకాహారం అందిస్తారన్నారు.


కరీమాబాద్: పిల్లలకు భోజనం వడ్డిస్తున్న కార్పొరేటర్ పద్మ, సూపర్‌వైజర్ రమాదేవి

### అంగన్‌వాడీ సేవలపై అవగాహన

కరీమాబాద్: లబ్ధిదారులు అంగన్‌వాడీ సేవలను వియోగించుకోవాలని 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఆర్‌తోటలోని అంగన్‌వాడీ సెంటర్లలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. కాలనీల్లోకి వెళ్లి అంగన్‌వాడీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# మార్కెట్ కమిటీల టార్గెట్లు ఖరారు

కాశీబుగ్గ, జూన్ 12: వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయ టార్గెట్‌ను ఇటీవల రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఖరారు చేసింది. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 18 మార్కెట్ కమిటీలకు గత సంవత్సరం రూ. 121 కోట్ల 70 లక్షల 31 వేలు నిర్ణయించగా, రూ. 107 కోట్ల 50 లక్షల 97 వేలు వసూలైనట్లు అధికారులు తెలిపారు.

ఈ సంవత్సరానికి రూ. 118 కోట్ల 71 లక్షల 71 వేలు ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలోని వరంగల్, నర్సంపేట, నెక్కొండ, వర్ధన్నపేట మార్కెట్ కమిటీల గతేడాది టార్గెట్ రూ. 66 కోట్ల 5 లక్షల 91 వేలు కాగా, రూ. 48 కోట్ల 91 లక్షల 44 వేలు వసూలైనట్లు తెలిపారు. ప్రస్తుత సంవత్సరం రూ. 61 కోట్ల 45 లక్షల 35 వేలు టార్గెట్ నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే, హనుమకొండ జిల్లాలోని పరకాల, ఆత్మకూర్, కమలాపూర్ మార్కెట్ కమిటీలకు రూ. 5 కోట్ల 45 లక్షలు, జనగామ జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల, పాలకుర్తి మార్కెట్ కమిటీలకు రూ. 17 కోట్ల 72 లక్షల 41 వేలు, మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, కేసముద్రం, తొర్రూరు మార్కెట్ కమిటీలకు రూ. 19 కోట్ల 34 లక్షల 66 వేలు, భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి, కాటారం, చిట్యాల మార్కెట్ కమిటీలకు రూ. 6 కోట్ల 90 లక్షల 55 వేలు, ములుగు జిల్లా మార్కెట్ కమిటీకి రూ. 7 కోట్ల 83 లక్షల 10 వేలు టార్గెట్ విధించినట్లు అధికారులు వెల్లడించారు.

# రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలి

కలెక్టర్ సత్యశారద


మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

సంగెం, జూన్ 12: మామునూరు విమానాశ్రయంలో రోడ్ల ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ సత్యశారద సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రోడ్ల నిర్మాణం చేసే ప్రదేశాలను పరిశీలించి సూచనలు చేశారు. గుంటూరుపల్లి నుంచి నేషనల్ హైవే వరకు, నక్కలపల్లి నుంచి గాడెపల్లి, గాడెపల్లి బైపాస్ వరకు ఏర్పాటు చేయనున్న రోడ్ల స్థలాలను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదించేందుకు త్వరితగతిన ప్రతిపాదనలు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రోడ్లు భవనాల శాఖ అధికారి రమేశ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ మధుసూదన్, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

### భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ఖిలావరంగల్: ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భూములు అప్పగించిన నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం త్వరితగతిన చెల్లించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కుడా చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డితో కలిసి సమీక్షించారు. గొర్రెకుంట, ఎనుమాముల, ఖిలావరంగల్, ఉర్సు గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులకు వెంటనే పరిహారం అందజేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, కేఎంటీపీ జోనల్ మేనేజర్ స్వామి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, కుడా పీవో అజిత్‌రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, ఎండీ ఇక్బాల్, రియాజొద్దీన్ పాల్గొన్నారు.

# ఉద్యోగ మేళాను విజయవంతం చేయాలి

గిర్మాజీపేట, జూన్ 12: ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్-టెక్‌బీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు హనుమకొండలోని ఐసీఎస్‌ఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో నిర్వహించనున్న సాఫ్ట్‌వేర్ రంగానికి సంబంధించిన ఉద్యోగమేళాను విజయవంతం చేయాలని డీఐఈవో శ్రీధర్‌సుమన్ కోరారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ, ఒకేషనల్ కంప్యూటర్ కోర్సు చేసిన విద్యార్థులు ఈ మేళాలో పాల్గొనాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ మెమోలు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతోపాటు అభ్యర్థుల ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్ తెచ్చుకోవాలన్నారు. వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధి 7569177071, 7981834205 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# సాయిగణేశ్ కాలనీలో రిటైర్డ్ ఎస్సై వీరంగం

కాశీబుగ్గ, జూన్ 12: వరంగల్ 14వ డివిజన్ సాయిగణేశ్‌కాలనీలో ఓ రిటైర్డ్ ఎస్సై వీరంగం సృష్టించాడు. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీలో నివాసముంటున్న ఓ కుటుంబానికి సంబంధించిన పిల్లలు ఇంటి ప్రహరీలోనే ఆడుకుంటున్నారు. పక్కనే నివాసముంటున్న రిటైర్డ్ ఎస్సై అల్లరి చేయొద్దని, తమకు ఇబ్బంది కలుగుతున్నదని నోరు జారాడు. వెంటనే ఓ బాలుడి తల్లి వచ్చి పిల్లలను ఎందుకు తిట్టుతున్నారని అడిగింది. ఆగ్రహానికి గురైన రిటైర్డ్ ఎస్సై 'నువ్వెందే నాకు చెప్పేది' అంటూ బూతులు తిట్టాడు. ఇంతలో ఆ మహిళ భర్త రాగా అతడిపై రిటైర్డ్ ఎస్సై దాడికి ప్రయత్నించాడు. వెంటనే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్లు తెలిపారు. రిటైర్డ్ ఎస్సై తమను బెదిరిస్తున్నాడని, రక్షణ కల్పించాలని బాధిత కుటుంబం పోలీసులను కోరింది.


ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న కమిషనర్

## ప్రజలకు అవగాహన కల్పించిన కమిషనర్

కరీమాబాద్, జూన్ 12: వరంగల్ మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గ్రేటర్ పరిధిలోని ప్రాంతాలను నివాసయోగ్యమైన, స్థిరమైన, కార్యాచరణకు అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే 43వ డివిజన్‌లోని పలు కాలనీల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ


ఎస్సై నరేశ్‌ను వివరాలు అడుగుతున్న డీసీపీ అంకిత్‌కుమార్

సంగెం, జూన్ 12: సంగెం పోలీస్‌స్టేషన్‌ను గురువారం వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, లాకప్‌లు, పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై ఎల్.నరేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రౌడీషీటర్లపై నిఘా పెంచాలన్నారు. ఆయన వెంట మామునూరు ఏసీపీ వెంకటేశ్, సీఐ రాజగోపాల్, ఎస్సై నరేశ్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఫొటోగ్రాఫర్ల భరోసా

ఖానాపురం, జూన్ 12: మండలంలోని కొత్తూరుకు చెందిన కాతం సాయికుమార్ గత నవంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కుటుంబ భరోసా పథకంలో సభ్యుడిగా ఉన్నాడు. ఈ మేరకు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ. 4.20 లక్షల విలువైన చెక్కును అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు తడుగుల స్వామి చేతులమీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కిరణ్, కుమార్, రవి, శ్యామ్, వెంకటేశ్, రాజు, నాగరాజు, శ్రీను, రమేశ్, ప్రవీణ్, సతీశ్, కార్తీక్ పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఖానాపురం తహసీల్దార్

ఖానాపురం, జూన్ 12: ఖానాపురం తహసీల్దార్‌గా నంగునూరి రమేశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న కిరణ్‌కుమార్ దీర్ఘకాల సెలవుల్లో వెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రమేశ్‌ను తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

## వాన దేవుడా కరుణించు..

గంగదేవిపల్లిలో కప్పతల్లి ఆడిన యువకులు

గీసుగొండ, జూన్ 12: వర్షాలు కురవాలి, పంటలు బాగా పండాలి.. వాన దేవుడా కరుణించు అంటూ జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిలో గురువారం యువకులు కప్పతల్లి ఆడారు. పత్తి విత్తనాలు నాటి నెల రోజులు అవుతున్నదని, వర్షాలు లేక ఎండిపోతున్నాయని, వర్షం పడాలని యువకులు కప్పతల్లి ఆడారు.


కప్పతల్లి ఆడుతున్న యువకులు